
www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 25 ఏప్రిల్ 2025

5

తూర్పుగోదావరి



వేసవి శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - సీతానగరం

సీతానగరం గ్రంథాలయంలో నిర్వహించే వేసవి శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారి అరుణ్‌కుమార్ తెలిపారు. ఈ నెల 28వ తేదీ నుంచి జూన్ 6వ తేదీ వరకూ ప్రతీ రోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ వేసవి శిక్షణా శిబిరాన్ని నిర్వహిస్తామన్నారు. విద్యార్థుల కోసం పలు కార్యక్రమాలను రూపొందించామని తెలిపారు. కథలు చెప్పడం, వినడం, రాయడం, పలు విజ్ఞానదాయకమైన కార్యక్రమాలను ఏర్పాటు చేవామన్నారు. సృజనాత్మకతను వెలికితీసేందుకు చిత్రలేఖనం, పేపర్ ఆర్ట్స్ వంటి కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. వక్తృత్వ, వ్యాసరచన పోటీలు, ఇతర ఇండోర్ గేమ్స్ వంటివి నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఉపాధి కూలీల వేతన వేదన

- జనవరి నుంచి తప్పని వస్తులు
- జిల్లా వ్యాప్తంగా రూ.15 కోట్లకు పైగా బకాయిలు



ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

జిల్లాలో ఉపాధి కార్మికులు వేతన వేదనను ఎదుర్కొంటున్నారు. జనవరి నెల నుంచి బకాయిలు ఉండటంతో పస్తులతో కాలం వెల్లదీస్తున్నారు. గ్రామాల్లో వలసలు నియంత్రించి ఉన్న ఊళ్లోనే పేదలకు పని కల్పించేందుకు వామపక్ష పార్టీలు పోరాడిసాధించిన ఉపాధి హామీ చట్టానికి పాలక వర్గాలు తూట్లు పొడుస్తున్నాయి. పనులు చేసి నాలుగు నెలలైనా ఇంకా వేతనం ఇవ్వకుండా తాత్సారం చేస్తున్నాయి. రోజంతా రెక్కలు ముక్కలు చేసుకుని శ్రమించినా సకాలంలో కూలి డబ్బులు అందడం లేదు. జనవరి మొదటి వారం నుంచి చెల్లింపులు స్తంభించడంతో బతుకు బండి రాగడం ఇబ్బందిగా మారిందని ఉపాధి కూలీలు ఆవేదన చెందుతున్నాడు. కూలి కోసం కళ్లు కాయలు కాచేలాఎదురు చూస్తున్నారు. మెటీరియల్, కరెంట్ బకాయిలు సైతం విడుదల చేయకపోడంతో కాంట్రాక్టర్లు గగ్గోలు పెడుతున్నారు.

జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం రబీ సీజన్ ముగిసింది. వరికోత మిషన్ల ద్వారా కోతలు చేపట్టడంతో వ్యవసాయ పనులు కూడా కూలీలకు దూరమయ్యాయి. దీంతో వారంతా ఉపాధి పనులనే నమ్ముకున్నారు. గత నెల రోజులుగా ప్రతి రోజూ 10 వేల నుంచి 11 వేల మంది వరకూ ఉపాధి పనులకు హాజరవుతున్నట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. రోజంతా కష్ట పడితే సగటున రూ.200 కూలి గిట్టుబాటు కావటమే కష్టతరంగా మారింది. ఆ డబ్బుతోనే కుటుంబాన్ని పోషించుకోవాల్సిన దుస్థితి. ప్రతి వారం డబ్బులు చెల్లిస్తేనే కూలీలు ఇంట్లోకి నిత్యావస వస్తువులు కొనుగోలు చేసుకుంటారు. జనవరి రెండో వారం నుంచి ఉపాధి వేతనాల చెల్లింపులు ఆగి పోయాయి. పనులు చేస్తున్నా పైసా కూడా ఖాతాల్లో జమ కాక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని 1,32,954 మంది కూలీలు ఉపాధి హామీ చట్టం ద్వారా పనులు పొందుతున్నారు.

2024-25 సంవత్సరంలో ఉపాధి పనుల్లో భాగంగా సిమెంట్ రోడ్ల నిర్మాణం చేపట్టింది. ఇందులో జిల్లాకు రాష్ట్రంలో రెండో స్థానం లభించింది. పశువుల షెడ్ల నిర్మాణంలో 7వ స్థానంలో నిలిచింది. పండ్ల తోటల పెంపకంలో ప్రథమ స్థానంలో ఉంది. గతేడాది సాధించిన లక్ష్యాలకు అనుగుణంగా 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్, మే, జూన్‌లో 35 లక్షల పని దినాలు కల్పన లక్ష్యంగా అధికారులు పెట్టుకున్నారు. ప్రస్తుతం వేతనాల చెల్లింపు నిలిచిపోవటంతో లక్ష్యం అందుకునే పరిస్థితి కనిపించట్లేదు. జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ వేతనాల కింద సుమారు రూ.15 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఒక్కో కూలీకి సగటున రూ.10 వేల నుంచి రూ.12 వేల వరకూ బకాయిలున్నాయి. ఉపాధి కూలి వస్తుందని భావించి కిరాణా దుకాణాల్లో ఇప్పటికే అప్పులు చేశారు. వాటిని తీర్చుకునేందుకు కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. కూలీల గురించి అధికారులను ప్రశ్నిస్తే స్పష్టమైన సమాధానం రావటంలేదనే ఆందోళన నెలకొంది. అదే విధంగా ఉపాధి హామీ పనుల్లో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో సిసి రోడ్లు, డ్రెయినేజీలు, కల్వర్టుల పనులు హడావుడిగా చేపట్టారు. ప్రస్తుతం రూ.40 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. అప్పులు చేసి మరీ పనులు చేపడితే, సకాలంలో బిల్లులు మంజూరు కాక, అప్పులకు వడ్డీలు చెల్లించలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామంటూ మరోపక్క కాంట్రాక్టరు వాపోతున్నారు.

అప్పు కూడా లభించట్లేదు

కిరాణాషాపుల్లో అప్పులు చేసి సరుకులు కొనుగోలు చేశాం. డబ్బులు చెల్లించాలని వ్యాపారుల నుంచి ఒత్తిడి పెరిగింది. కొత్తగా అరువు ఇచ్చేందుకు వారు ససేమిరా అంటున్నారు. దీంతో బయట అప్పులు చేయాల్సి వస్తుంది. మూడు నెలలుగా వేతనాలు రాలేదు. మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లను అడుగుతుంటే త్వరలోనే వస్తాయని చెబుతున్నారు. అధికారులు సైతం కచ్చితంగా చెప్పలేకపోతున్నారు.

- సిహెచ్.నాగరాజు, కూలీ, పక్కిలంక

8 గంటల పని విధానాన్ని కాపాడుకుందాం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

అంతర్ జాతీయ కార్మిక దినోత్సవం మేడే స్ఫూర్తితో 8 గంటల పని విధానాన్ని కాపాడుకుందామని, లేబర్ కోడ్స్ రద్దు కోసం ఉద్యమిద్దామని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.పవన్ పిలుపునిచ్చారు. నగరంలోని శ్యామల సెంటర్ వద్ద సిఐటియు కార్యాలయంలో మే డే సందర్భంగా ముద్రించిన కర పత్రాన్ని సిఐటియు నాయకులు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐ టియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.పవన్ మాట్లా డారు. ప్రపంచ కార్మికవర్గ చరిత్రను 1886 అమె రికాలోని చికాగోలో జరిగిన కార్మిక తిరుగుబాటు మలుపు తిప్పిందన్నారు. వందలాది మంది కార్మికుల ప్రాణత్యాగలతో పుట్టిన ఎర్ర జెండా పోరాటానికి పెట్టుబడిదరులు తలొగ్గారన్నారు. అప్పటి నుంచి 8 గంటల పని విధానం అమల్లోకి వచ్చిందన్నారు. అంతకు ముందు కార్మికులతో 12 నుంచి 16 గంటల పాటు బానిసల్లా పని చేయించేవారన్నారు. మే డే పోరాటం వెట్టిచాకిరీ నుంచి విముక్తి కల్పిం చిందన్నారు. కాని కేంద్రంలో నేటి బిజెపి సర్కారు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కార్మికులను బానిసలుగా, పెట్టుబడిదరులకు లాభాలు పెంచేం దుకు పని గంటలను 8 నుంచి 12 గంటలకు పెంచాలని చూస్తుందన్నారు. కార్మిక వర్గం మే డే స్ఫూర్తితో 8 గంటల పని విధానాన్ని కాపాడుకోవ డానికి పోరాడాలని పిలునిచ్చారు. మోడీ ప్రభుత్వం ఈజీ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో పెట్టుబడి దారులకు మరిన్ని లాభాలు పెంచేందుకు కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేస్తూ లేబర్ కోడ్స్‌ను తీసుకొచ్చిందన్నారు. లేబర్ కోడ్స్ అమల్లోకి వస్తే కార్మికులు సంఘం ఏర్పాటు చేసుకునే హక్కును కూడా కోల్పోతారన్నారు. కనీస వేతనాల చట్టం రద్దు అవుతుందన్నారు. ఉద్యోగ భద్రత కరువవుతుందన్నారు. రెగ్యులరైజేషన్, ఇఎస్ఐ, పిఎఫ్, కార్మికుల భద్రత చివరికి సమ్మె హక్కు కూడా లేకుండా పోతుందన్నారు. కార్మికులకు తీవ్ర స్థాయిలో నష్టం కల్గించే లేబర్ కోడ్స్‌ను కరోనా విపత్కర కాలం 2020లో పార్లమెంట్‌లో కనీసం చర్చించకుండా అప్రజాస్వామికంగా మోడీ ప్రభుత్వం చట్టం చేసిందన్నారు. వీటికి రాష్ట్రంలో ఉన్న నాటి వైసిపి ప్రభుత్వం, నేటి టిడిపితో కూడిన కూటమి ప్రభుత్వం మద్దతు పలికి అమలుకు సిద్ధమవుతున్నాయని విమర్శించారు. లేబర్ కోడ్స్ రద్దయ్యే వరకు కార్మిక వర్గం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎం.సుందరబాబు, జిల్లా ఉపాధ్యక్షులు టి.అరుణ్, ఎస్ఎస్.మూర్తి, జిల్లా కార్యదర్శి బి.పూర్ణిమరాజు, నాయకులు మాచారావు, సూరి బాబు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన సత్రం వేలాన్ని రద్దు చేయాలి

ప్రజాశక్తి - రాజానగరం

రాజా కాండ్రేగుల జోగిజగన్నాథ బహుదూర్ అన్నదాన సత్రం భూముల వేలంలో అక్రమాలు జరిగాయని వెంటనే ఈ వేలాన్ని దర్దు చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముప్పిడి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. దీనిపై మెయిన్ రోడ్ సత్రం ప్రధాన రహదారిపై ఆయన గురువారం రిలే నిరాహార దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 25.15 ఎకరాలను ఏడాదికి రూ.5లక్షలకు వేలం ఖరారు చేశారన్నారు. ఈ వేలం నిర్వహించిన తర్వాత జనసేన, టిడిపి, బిజెపి నాయకులు అనధికారికంగా మళ్లీ వేలం నిర్వహించి రూ.11 లక్షలకు ఖరారు చేశారన్నారు. కూటమి నాయకులు ప్రణాళిక ప్రకారం రింగ్‌గా ఏర్పడి తక్కువ మొత్తానికి అధికారికంగా వేలం దక్కించుకుని, అనంతరం అనధికారికంగా వేలం నిర్వహించారన్నారు. దీనివ్ల రూ.6 లక్షలుపైగా ఆదాయానికి గండిపడిందన్నారు. వెంటనే అధికారులు నిర్వహించిన వేలాన్ని రద్దు చేయాలన్నారు. సీల్ టెండర్లు లేదా బహిరంగ వేలం నిర్వహించాలన్నారు.

ఆర్ట్స్ కళాశాలకు ఎపిఎస్‌సిహెచ్ఇ అవార్డు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ప్రపంచ మేధో సంపత్తి దినోత్సవం సందర్భంగా 'ఐపి మరియు సంగీతం - ఫీల్ ది బీట్ ఆఫ్ ఎపి" విభాగంలో ప్రతిష్టాత్మకమైన ఎపిఎస్‌సిహెచ్ఇ రాష్ట్ర స్థాయి అవార్డును ఆర్ట్స్ ప్రభుత్వ కళాశాల దక్కించుకుంది. స్వల్పకాలిక ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్ కింద కళాశాలలోని ప్రతిభావంతులైన విద్యార్థులు రూపొందించిన అత్యుత్తమ కళాశాల ఆడియో-విజువల్ (ఎవి) ప్రదర్శనకు ఈ అవార్డు దక్కింది. విద్యార్థులు థీమ్‌కు భావనాత్మకంగా, కళాశాల చరిత్ర, విద్యా నైపుణ్యం, సాంస్కృతిక వైవిధ్యం, ఆవిష్కరణల పట్ల నిబద్ధత ప్రతిబింబించేలా సాంకేతిక నైపుణ్యంతో కూడిన ఎవి ప్రదర్శన జ్యూరీని ఆకట్టుకుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఎపిఎస్‌సిహెచ్ఇ వైస్-చైర్మన్ ప్రొఫెసర్ రామ్మోహన్‌రావు, గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ గంగాధర్ నుంచి ప్రిన్సిపల్ ఆర్‌కె.రామచంద్ర ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, అధ్యాపకుల సమిష్టి కృషి ఫలితమే ఈ అవార్డు అన్నారు.

లోవోల్టేజీతో ఇబ్బందులు

సీతానగరం : లోవోల్టేజీతో నానా ఇబ్బందులు పడుతున్నామని పురుషోత్తపట్నంలోని ఎస్‌సి కాలనీ వాసులు వాపోతున్నారు. ఈ సంద ర్భంగా వారు ఎఇఇ, ఎడిఇలకు గురువారం వినతిపత్రాలు అందించారు. వారు మాట్లాడుతూ కాలనీలో 100 గృహాల్లో 130 వరకూ కుటుంబాలు జీవిసుత్నన్నయన్నారు. ఈ ఇళ్లన్నింటికీ విద్యుత్ సరిగా సరఫరా కావట్లేదన్నారు. లోవోల్టేజీ వల్ల ఎలక్ట్రికల్ వస్తువులు ఏవీ పనిచేయట్లేదన్నారు. వేసవి నేపథ్యంలో ఫ్యాన్లు కూడా తిరగకపోవడంతో చిన్నారులు, వృద్ధులు ఆపసోపాలు పడుతు న్నారన్నారు. విద్యుత్ బల్బులున్నా వెలగకపో వడంతో అంధకారంలో జీవస్తున్నామన్నారు. విద్యుత్ హెచ్చుతగ్గుల వల్ల ఎలక్ట్రికల్ సామగ్రి కాలిపోతుందన్నారు. తక్షణమే స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని వారు అధికారులను వేడుకుంటున్నారు.

పెరవలిలో 82 శాతం ఉత్తీర్ణత

పెరవలి : పెరవలి మండలంలో పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో 82 శాతం ఉత్తీర్ణత సాధించామని ఎంఇఒలు బి.స్వరూప్, షేక్ నూర్జహాన్ తెలిపారు. 684 మందికి 562 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. వీరిలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు 438 మంది హాజరు కాగా 319 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు 246 మందికి 243 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. మల్లేశ్వరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి వేమన నాగేశ్వరి 578 మార్కులు, ప్రైవేట్ విభాగంలో శశి ఉన్నత పాఠశాల విద్యార్థి ఐజిటిబి.విల్సన్ 587 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచారన్నారు.

కార్టూ'నిజం'



మెగా డిఎస్‌సి పేర మోసం

డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆదివాసీ నిరుద్యోగుల నిరసన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం



నిరసన తెలుపుతున్న ఆదివాసీ నిరుద్యోగులు, డివైఎఫ్ఐ నాయకులు

మెగా డిఎస్‌పి పేరుతో ఆదివాసీ నిరుద్యోగులను ప్రభుత్వం మోసం చేస్తుందంటూ డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆదివాసీ నిరుద్యోగులు రాజమహేంద్రవరం శ్యామల సెంటర్ వద్ద డిఎస్‌సి నోటిఫికేషన్ పత్రాలను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ వి.రాంబాబు మాట్లాడారు. ప్రభుత్వం ప్రకటించిన మెగా డిఎస్‌సిలో అన్ని పోస్టులు జనరల్ రిజర్వేషన్‌లోనే భర్తీ చేయడం దారుణమన్నారు. 5వ షెడ్యూల్ ప్రాంతమైన ఏజెన్సీకి స్పెషల్ డిఎస్‌సి ప్రకటించాలని, జిఒ నెంబర్ 3ని పునరుద్ధరించాలన్నారు. ఆదివాసీలకు ప్రత్యేక ప్రతిపత్తి ఉంటుందని, ప్రత్యేక పాలన విభాగం ఉంటుందన్నారు. ఆ ప్రాంతంలో అత్యధికంగా ఆదివాసీ గిరిజనులు జీవనం కొనసాగిస్తుంటారని ఆర్థికంగా విద్యాపరంగా అభివద్ధి పరంగా వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించి అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. అటువంటి ప్రభుత్వాలే రిజర్వేషన్లను తొలగించి ఆదివాసీ నిరుద్యోగులను అయోమయంలోకి నెట్టేసిందన్నారు. మెగా డిఎస్‌సిలో ఏజెన్సీ ప్రాంతానికి 888 పోస్టులు కేటాయించిందన్నారు. అందులో 2శాతం ఉన్న గిరిజనేతరులకు అధికంగా, గిరిజన ప్రాంతంలో ఉన్న గిరిజనులకు ఆరు శాతం పోస్టులు మాత్రమే కేటాయించడం చాలా దుర్మార్గమన్నారు. స్థానిక గిరిజనులకే నూరు శాతం ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మైదాన ప్రాంతంతో ఏజెన్సీ ప్రాంత అభ్యర్థులు ఎలా పోటీ పడతారని ప్రశ్నించారు. ఒక బలహీనున్ని బలవంతునితో పోటీ పెట్టే విధంగా ఈ డిఎస్‌సి ఉందన్నారు. ఆరు శాతం రిజర్వేషన్‌తో ఏజెన్సీలో గిరిజనులకు న్యాయం జరగదన్నారు. ప్రభుత్వం మెగా డిఎస్‌సిపై పున: పరిశీలన చేయాలన్నారు. ఏజెన్సీ ప్రాంతానికి ప్రత్యేక డిఎస్‌సిని ప్రకటించాలన్నారు. ఏజెన్సీలో ఉన్న ప్రతి ఎంఎల్ఎకు నిరుద్యోగులు వినతిపత్రాలు ఇచ్చారన్నారు. వారు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. పాడేరులో జరిగిన పాలకవర్గ సమావేశంలో ఆదివాసీలను మభ్యపెట్టే విధంగా గిరిజన సంక్షేమ శాఖ మంత్రి ప్రత్యేక జిఒను తెచ్చి మరొక ప్రత్యేక ఏజెన్సీ డిఎస్‌సి ప్రకటిస్తామని మాయమాటలు చెబుతున్నారన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న ఖాళీలను మొత్తం జనరల్ డిఎస్‌సిలో భర్తీ చేసి భవిష్యత్తులో ఎక్కడ నుంచి ఖాళీపోస్టులను తీసుకొస్తారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమానికి సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ హాజరై మద్దతు తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న ఆదివాసీలకు ఆ ప్రాంతంలో నూరుశాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. అది వారి హక్కున్నారు. ప్రభుత్వం దానిని మరిచి నోటిఫికేషన్ విడుదల చేసి ఆదివాసీలకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. ఆదివాసీలకు న్యాయం జరిగే వరకూ సిపిఎం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఏజెన్సీ ప్రాంతంలో ఏజెన్సీ ఉద్యోగ నియామక చట్టం చేయాలన్నారు. జిఒ 3ని పునరుద్ధరణ చేస్తామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలన్నారు. వెంటనే జిఒ 3 స్థానంలో ఒక ఆర్డినెన్స్‌ను జారీ చేసి ఆదివాసీలకు జరిగే అన్యాయాన్ని సరిచేయాలని కోరారు. ఏజెన్సీ ప్రాంత అభ్యర్థులకు న్యాయం చేయకపోతే అన్ని ప్రజా సంఘాలు, పార్టీలతో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి ఆదివాసీ నిరుద్యోగులు అశోక్, సోడే చందుబాబు, పాయం రతన్, కారం నవీన్ అజయ్, హరిత ,నిరోష, అరుణ డివైఎఫ్ఐ నాయకులు అశోక్, రాజేష్, సుధ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.పవన్, బి.పూర్ణిమరాజు తదితరులు పాల్గొన్నారు.

పది ఫలితాల్లో 'జ్ఞాన సరస్వతి' హవా

ప్రజాశక్తి-గోకవరం

పదో తరగతి ఫలితాల్లో జ్ఞాన సరస్వతి స్కూలు విద్యార్థులు సత్తా చాటారు. మొదటి ఏడాదిలోనే నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా స్కూలు చైర్మన్ కంచర్ల సూర్యప్రకాష్, స్కూలు డైరెక్టర్, ఫౌండర్ బొడ్డటి సురేష్ మాట్లాడారు. జ్ఞాన సరస్వతి విద్యా నికేతన్ స్కూలును స్థాపించి రెండేళ్లవుతుందన్నారు. పదోవతరగతి ప్రారంభించిన మొదటి సంవత్సరమే నూరు శాతం ఉత్తీర్ణత సాధించామన్నారు. నలుగురు విద్యార్థులకు 500కు పైగా మార్కులు వచ్చాయన్నారు.. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు పుష్పగుచ్చాలు అందించి అభినందించారు.



ఉగ్రదాడి కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి -దేవరపల్లి



పహల్గావ్ ఉగ్రదాడికి కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలని సిఐటియు మండల కార్యదర్శి ఎస్.భగత్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉగ్రవాద దాడిలో మృతి చెందిన వారికి గురువారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ భద్రది వైఫల్యమే దాడులకు కారణమన్నారు. నిఘా సంస్థలు హెచ్చరిస్తున్నప్పటికీ పర్యాటక ప్రాంతంలో ఎటువంటి భద్రత కల్పించకపోవడం దారుణమన్నారు. ఉగ్రవాదానికి మతంతో సంబంధం లేదన్నారు వైషమ్యాలు రెచ్చగొట్టడం కోసం మతోన్మాదులు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఉండవల్లి కృష్ణారావు పిన్నమనేని సత్యనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కె.రత్నాజీ, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు రాపాక స్వర్ణ, ఆకుల ప్రసన్న, బాలోత్సవ కమిటీ నాయకులు ఆచంట సుభాష్ చంద్రబోస్, మిరియాల క్రాంతి, స్కూల్ స్వీపర్స్ ప్రత్తిపాటి ధనలక్ష్మి, కె.పోచమ్మ, ఎ.సూర్యారావు పాల్గొన్నారు.

దేవరపల్లి : దేవరపల్లిలోని జనసేన పార్టీ కార్యాలయం వద్ద గురువారం ఆ పార్టీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి దొడ్డిగర్ల సువర్ణరాజు ఆధ్వర్యంలో ఉగ్రవాద దాడిలో మృతులకు సంతాపం తెలుపుతూ ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు మౌన దీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండలం అధ్యక్షులు కాట్నం గణేష్, దేవరపల్లి సమన్వయ కమిటీ సభ్యులు పసుపులేటి ప్రసాద్, కంబాల సత్తిబాబు, శ్రీను, శ్రీను పాల్గొన్నారు

తాళ్లపూడి : జమ్మూ కాశ్మీర్‌లో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తూ తాళ్లపూడిలో గురువారం వివిధ సేవా సంస్థలు, యువకుల ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉగ్రవాదం నశించాలి అంటూ నినదించారు. తాళ్లపూడి బస్టాండ్ సెంటర్ నుంచి పైడిమెట్ట జంక్షన్ వరకు ఈ ర్యాలీ నిర్వహించారు. ఈ నిరసన ర్యాలీలో బొర్రా శ్రీరామ్మూర్తి, అడ్డా మోహన్, నీలి శ్రీను, అప్పన జగదీష్, నాయుడు పాల్గొన్నారు.

కడియం : ఉగ్రవాదానికి మతం ఉండదని, దోషులు ఎవరైనా కఠినంగా శిక్షించాలని జమాతే ఇస్లామీ హింద్ ఎపి అధ్యక్షులు మహ్మద్ రఫీఖ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ చట్టాన్ని రద్దు చేయాలంటూ రాష్ట్రంలో ముస్లింలు అందరిని ఏకం చేయడంలో భాగంగా మండల కేంద్రమైన కడియం మసీదును ఆయన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పహల్గావ్‌లో జరిగిన ఉగ్ర దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఫల్యం వల్లే ఇలాంటి దాడులు పునరావృతం అవుతున్నాయన్నారు. ఎన్‌డిఎ ప్రభుత్వం కొన్నేళ్లుగా సైన్యంలో ఖాళీలను భర్తీ చేయట్లేదన్నారు. కాశ్మీర్ ప్రజలు ఎంతో సౌమ్యులని, పర్యాటకులను అతిథులుగా చూసే మనస్తత్వం కలవరాన్నారు. ఈ ఘటన దురదృష్టకరమన్నారు. ఉగ్రదాడిని సాకుగా చూపిస్తూ ప్రజలను తప్పుదారి పట్టించి, వక్ఫ్ వ్యతిరేక ఉద్యమాన్ని అణగదొక్కేందకు చూస్తున్నారన్నారు. ఉగ్రదాడిని ఖండిస్తూ వక్స్ సవరణ బిల్లులను నిరసిస్తూ తాము చేపట్టిన నిరసన కార్యక్రమాలను మూడు రోజులపాటు నిలిపి వేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మసీదు ప్రెసిడెంట్ షేక్ సలీం, సెక్రటరీ సర్కార్ భాషా, షేక్ రషీమ్, షేక్ లోషన్, షేక్ బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం

ప్రజాశక్తి - తాళ్లపూడి

గ్రామ స్వరాజ్యం ప్రజల సహకారంతోనే సాధ్యమని గజ్జరం సర్పంచ్ డాక్టర్ గండి రాంబాబు అన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని గురువారం సచివాలయం వద్ద నిర్వహించారు. సర్పంచ్ రాంబాబు, ఉప సర్పంచ్ శేషు గాంధీ, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. పెద్దేవం సచివాలయం వద్ద ఉపసర్పంచ్ తోట రామకృష్ణ అధ్యక్షతన కార్యదర్శి హసీనా బేగం ఆధ్వర్యంలో, వేగేశ్వరపురం సచివాలయం వద్ద సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు అధ్యక్షతన కార్యదర్శి నాగఆంజనేయులు ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ దినోత్సవాలను నిర్వహించారు.

గోకవరం : గోకవరం ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని ఎంపిపి సుంకర శ్రీవల్లి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఎం.గోవింద్, వైసిపి నాయకులు సుంకర వీరబాబు, వైస్ ఎంపిపిలు మడికి మైనర్‌బాబు, గోకాడ చిట్టిబాబు, ఎంపిటిసి సభ్యులు, ఎంపిడిఒ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

టాపర్లుగా నిలిచిన కవలలకు సన్మానం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ప్రభుత్వ కళాశాలలో విద్యనభ్యసించి టాపర్లుగా నిలిచిన వెలగదుర్రుకు చెందిన కవలలు గున్నేపల్లి తనుశ్రీ, గున్నేపల్లి తన్వికలను గురువారం ఘనంగా సన్మానించారు. వెలగదుర్రుకు చెందిన వీరు జడ్‌పి ఉన్నల పాఠశాల ప్లస్ మహిళా కళాశాలల్లో ఇంటర్ సిఇసి చదివారు. వేయి మార్కులకు తన్విక 815, తనుశ్రీ 789 మార్కులు సాధించి మొదటి రెండు స్థానాల్లో నిలిచారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ పెద్దల ఆధ్వర్యంలో వారిని సన్మానించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు ముదునూరి రవీంద్రరావు మాట్లాడారు. సోదరీమణులు పలువురికి ఆదర్శంగా నిలవాలన్నారు. మారుమూల గ్రామానికి చెందిన వీరుఉత్తమ మార్కులతో ఉత్తీర్ణులు కావడం ఆదర్శనీయమన్నారు. ఈ సందర్భంగా పాతూరి నరేంద్రబాబు, దాసరి వెంకన్న, దొడ్డా సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శి షేక్ షాన్‌బీబీ, సిబ్బంది వారిని అభినందించారు.

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షునిగా ఏడుకొండలు

నల్లజర్ల : నల్లజర్ల మండల కాంగ్రెస్ అధ్యక్షునిగా బుడిగిన ఏడుకొండలు, గోపాలపురం నియోజకవర్గ బ్లాక్-2 కాంగ్రెస్ కమిటీకి ముసుళ్లగుంట గ్రామానికి చెందిన టి.ఫ్రాన్సిస్‌ను నియమించినట్టు ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు టికె.విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. దీనికి సంబంధించిన నియామక పత్రాలను ఆయన వారికి గురువారం అందజేశారు. ఈ సందర్భంగా వారు ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేకు, రాహుల్ గాంధీ, సోనియా గాంధీ, షర్మిలలకు కృతజ్ఞతలు తెలిపారు.

పేదలకు భూములు పంచాలని ర్యాలీ

సీతానగరం : ప్రభుత్వ మిగులు భూములను తక్షణమే పేదలకు పంచాలని గురువారం సిపిఐఎంఎల్ ఆధ్వర్యంలో సీతానగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. పార్టీ నాయకుడు పలివెల వీరబాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. చినకొండేపూడి గ్రామం మీదుగా, నాలుగు బొమ్మల సెంటర్ వరకూ కొనసాగి, అనంతరం తహశీల్దార్ కార్యాలయానికి చేరుకుంది. అనంతరం డిటి సునీతకు వినతిపత్రం అదించారు. ఈ సందర్భంగా పలివెల వీరబాబు మాట్లాడుతూ ప్రభుత్వం గుర్తించిన మిగులు భూములను వెంటనే పేదలకు పంపిణీ చేయాలన్నారు. లేకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు.

పలువురికి మంత్రి దుర్గేష్ పరామర్శ

నిడదవోలు : నిడదవోలు నియోజకవర్గంలో ఇటీవల ప్రమాదవశాత్తూ అనారోగ్యానికి గురైన గొల్లా రాజశేఖర్, మద్దిరాల చిన్నా, పట్టపగలు ప్రసాద్‌లను పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ గురువారం పరామర్శించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, జనసేన పార్టీ పట్టణ అధ్యక్షులు రంగ రమేష్, నాయకులు గంగాధర్ తదితరులున్నారు.

ఉగ్రదాడిని ఖండిస్తూ తీర్మానం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని తాడిపర్రు పంచాయతీ కార్యాలయంలో గురువారం అత్యవసర సమావేశం నిర్వహించి ఉగ్రదాడిని ఖండిస్తూ తీర్మానం చేశామని తాడిపర్రు సర్పంచ్ కరటూరి నరేంద్రబాబు తెలిపారు. దేశం నుంచి ఉగ్రవాదులను తరిమికొట్టేందుకు మద్దతు తెలుపుతామన్నారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి



ప్రజాశక్తి - కొవ్వూరు

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును తక్షణం పునరుద్ధరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు వల్లేపల్లి నరసింహమూర్తి అధ్యక్షతన జరిగిన సభలో సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ముద్దుకూరి దొరయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుందర్‌బాబు మాట్లాడారు. గత ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. అధికారంలోకి వస్తే వెంటనే భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ హామీ ఇచ్చారన్నారు. కాని అధికారంలోకి వచ్చిన తరువాత కూటమి ప్రభుత్వం ఈ హామీని తుంగలో తొక్కిందన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాదైనా నేటికీ హామీలు అమలుకు నోచుకోలేదన్నారు. బోర్డును పునరుద్ధరిస్తే భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా కేటాయించాల్సిన అవసరం లేదన్నారు. భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయడం వల్ల మన రాష్ట్ర ప్రభుత్వానికి ఏమాత్రం ఆర్థిక భారం ఉండదన్నారు. ఇప్పటికే బోర్డులో ఉన్న కార్మికుల నిధి సెస్సు రూ.4,298 కోట్లను కార్మికుల సంక్షేమానికి వినియోగించాలని డిమాండ్ చేశారు. నిర్మాణ కార్మికుల పట్ల గత ప్రభుత్వం చేసిన నిర్లక్ష్యాన్ని ఈ ప్రభుత్వ కొనసాగిస్తుందని విమర్శించారు.కార్మికుల సంక్షేమాన్ని రాష్ట్ర ప్రభుత్వం విస్మరిస్తే ఎంతటి పోరాటాల కైనా కార్మికులు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. తొలుత బస్టాండ్ సెంటర్ నుంచి ఆర్‌డిఒకార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్‌డిఒ రాణి సుస్మితకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.పవన్ జిల్లా నాయకులు బి.పూర్ణిమరాజు మద్దతు తెలియజేశారు. మైగాపుల నాగేశ్వరరావు, వీరా త్రిమూర్తులు పి.గంగాధరం, ఎం.హరిబాబు, ఆర్.నాగేశ్వరరావు, జె.రాంబాబు, ఎన్.కొండబాబు, జి.శ్రీను, కె.శివ తదితరులు పాల్గొన్నారు.

'పిఎం సూర్యఘర్'పై అవగాహనా సదస్సు



ప్రజాశక్తి - పెరవలి

మండల సమాఖ్య కార్యాలయంలో గురువారం పిఎం సూర్యఘర్ యోజన పథకంపై అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎపిఇపిడిసిఎల్ నిడదవోలు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పియుబి.శ్రీధర్ హాజరై మాట్లాడారు. ఈ పథకం గురించి లబ్ధిదారులకు వివరించారు. సాధ్యమైనంత ఎక్కువమందికి అవగాహన కల్పించడానికి గ్రామస్థాయిలో కూడా సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రికల్ ఎఇ డేవిడ్ నిశ్చల్, ఎపిఎం బండారు రామకృష్ణ, సిసిలు, విఎఒలు, పిఎం సూర్య ఘర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చాగల్లు : పిఎం సూర్య ఘర్‌లో చేరితే ఒక్క రూపాయి కూడా కరెంట్ బిల్లు కట్టనవసరం లేదని ట్రాన్స్‌కో ఎఇ సుంకర త్రిమూర్తులు తెలిపారు గురువారం మండల సమాఖ్య కార్యాలయంలో సోలార్ విద్యుత్‌పై మహిళా సంఘాలకు అవగాహనా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రధాని పిలుపు మేరకు ప్రతి ఒక్కరు సోలార్ కరెంట్‌ను పెట్టుకోవడానికి ముందుకు రావాలన్నారు. ప్రభుత్వం ప్రకటించిన వేలాది రూపాయల సబ్సిడీని అందింపుచ్చుకోవాలన్నారు. ఈ సమావేశంలో విఒఎలు, లబ్ధిదారులు, ఎఇ జె.శ్రీనివాస్, ఇన్‌ఛార్జి ఎపిఎం పి.సాయిలక్ష్మి, సిసి చిన్నశ్రీనివాస్, పోశమ్మ, అకౌంటెంట్ దుర్గా భవాని, ఎంఎస్ అధ్యక్షురాలు డొక్కు లక్ష్మీపార్వతి పాల్గొన్నారు.

తాళ్లపూడి : విద్యుత్ వినియోగదారులు ప్రతి ఒక్కరు పిఎం సూర్య ఘర్ స్కీమ్ లో చేరితే ఒక్క రూపాయి కూడా కరెంట్ బిల్లు కట్టాల్సిన అవసరం లేదని ఎఇ శ్రీనివాస్ తెలిపారు. తాళ్లపూడి మండల సమాఖ్య కార్యాలయంలో ఎపిఎం మంగాయమ్మ ఆధ్వర్యంలో సోలార్ విద్యుత్ వినియోగంపై మహిళలకు గురువారం అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వివోలు, సిఎలు, క్లస్టర్ సిసిలు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం కేంద్రంగా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం కేంద్రంగా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో 'రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ అండ్ స్పోక్స్' విధానం కార్యాచరణపై జెసి ఎస్.చిన్న రాముడు, గ్రీన్ కోర్, ఒఎన్‌జిసి, గెయిల్, ఇతర ఇన్నోవేటివ్ ఏజెన్సీస్, ఎన్ఐటిఎ, జెఎన్‌టియు ఎక్స్‌పర్ట్ టీమ్స్, పారిశ్రామిక ప్రోత్సాహక కమిటీ, ఇతర సమన్వయ శాఖల జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఫలవంతం అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆంధ్ర ప్రదేశ్‌లో ఆవిష్కరణ, వ్యవస్థాపకతలో మార్గదర్శకులను అనుసరించి, పారిశ్రామిక ప్రగతి, తద్వారా ఒక శక్తివంతమైన స్టార్ట్-అప్ పర్యావరణ వ్యవస్థను నిర్మించడానికి అడుగులు వేస్తామన్నారు. రాజమహేంద్రవరంలో హబ్ ఏర్పాటుకు ఆర్ఎంసి కమిషనర్ ఆధ్వర్యంలో రెండు ఎకరాల స్థలం గుర్తించనున్నట్లు తెలిపారు. బోర్డ్ కమిటీ గవర్నింగ్ వ్యవస్థకు గ్రీన్ కోర్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి ప్రమోటర్‌గా వ్యవహరిస్తారని తెలిపారు. సహా ఎగ్జిక్యూటివ్ విధానంలో సహా ప్రమోటర్‌గా ఒఎన్‌జిసి, గెయిల్, అవంతి తదితరులు, ఎక్స్‌పర్ట్ టీమ్ సభ్యులుగా ఉంటాయన్నారు. ఈ సమావేశంలో జెఎన్‌టియు విసి ప్రొఫెసర్ ఎ.గోపాలకృష్ణ, ఎన్ఐటి డైరెక్టర్ ప్రొఫెసర్ జి.రవికిరణ్‌శాస్త్రి, గ్రీన్ కోర్ సిఇఒ పి.రాంబాబు, ఐటిఇఅండ్ సిఒఎస్‌డి ఆర్.దీప్తి, గెయిల్ అధికారి డి.ప్రభాకర్, ఒఎన్‌జిసి అధికార ప్రతినిధి జి.శ్రీనివాస్ , జిల్లా పరిశ్రమల అధికారి శ్రీవనిధర్‌రామన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నీటి తీరువా పన్నులపై వ్యక్తిగత పర్యవేక్షణ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్



రెవెన్యూ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నీటి తీరువా పన్నుల వసూళ్లపై వ్యక్తిగత పర్యవేక్షణ తప్పనిసరి అని కలెక్టర్ పి.ప్రశాంతి స్పష్టం చేశారు. గురువారం క్షేత్ర స్థాయి రెవెన్యూ అధికారులు సమావేశం జెసి ఎస్.చిన్నరాముడు, డిఆర్ఒ టి.సీతారామమూర్తిలతో కలిసి కలెక్టర్ నిర్వహించారు. రెవెన్యూ అంశాలు, పిజిఆర్ఎస్, రీ సర్వేలపై సమీక్ష చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండల వారీగా వాటర్ యూజర్స్ అసోసియేషన్ వివరాలు ప్రచురించాలన్నారు. ఇందుకు సంబంధించి రెవెన్యూ అధికారులు బాధ్యత తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి స్థాయిలో నీటి తీరువా పన్నుల వసూళ్లపై వ్యక్తిగత పర్యవేక్షణ చేస్తారన్నారు. జిల్లాలో 2.80లక్షల ఎకరాల ఆయకట్టు పరిధిలో సాగు విస్తీర్ణం ఉందన్నారు. దీనికి సంబంధించి రూ.2,84,51,378 మేర పన్నులు వసూలు చేయాల్సి ఉందన్నారు. ఇప్పటి వరకూ 42.16 శాతం అంటే రూ.2,00,11,361 మాత్రమే వసూలు చేశారన్నారు. రాజమండ్రి డివిజన్‌లో 40.57 శాతం, కొవ్వూరు డివిజన్‌లో 43.75శాతం మేర లక్షలు సాధించారన్నారు. మార్గదర్శకాల మేరకు జనవరి నెలాఖరారు నాటికి లక్ష్యాలను సాధించాల్సి ఉందన్నారు. ఆయకట్టు పరిధిలో సాగు విస్తీర్ణం నిర్ధారణ హెచ్చు తగ్గులను రెవెన్యూ, ఇరిగేషన్, వ్యవసాయ శాఖలు ఆధ్వర్యంలో నిర్ధారణ చేయాలన్నారు. పిజిఆర్ఎస్ అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. సగటుత తొలి అయిదు అంశాల్లో భూముల కొలతల్లో వ్యత్యాసాలు, ఎల్‌పిఎంకు చెందిన విభజన కోసం అర్జీలు, దిద్దుబాట్లు, మ్యూటేషన్, సరిహద్దు కొలతలకు సంబంధించిన అర్జీలే వస్తున్నాయన్నారు. ప్రతి నెలా నిర్వహిస్తున్న రివ్యూ సమావేశానికి హాజరయ్యామా? లేదా? అనే రీతిలో కాకుండా అర్జీలను పరిష్కరించేలా కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఒ టి.సీతారామమూర్తి, ఆర్‌డిఒలు ఆర్.కృష్ణనాయక్, రాణి సుస్మిత, హౌసింగ్ పీడీ ఎస్.భాస్కర్‌రెడ్డి, జిల్లా సర్వే అధికారి బి.లక్ష్మీనారాయణ, కలెక్టరేట్ ఎఒ ఆలీ, తహశీల్దార్లు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు,

డంపింగ్ యార్డుకు స్థలాల పరిశీలన

ప్రజాశక్తి- యానాం

పుదుచ్చేరి కలెక్టర్ కులుంగోత్తన్ యానాంలో గురువారం పర్యటించారు. ఉదయం రాజమహేంద్రవరం విమానాశ్రయంలో దిగిన ఆయనకు ఆర్ఎఒ మునిస్వామి తదితరులు స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గంలో యానాం వచ్చారు. అనంతరం చెత్త వేయడానికి డంపింగ్ యార్డ్ కోసం వివిధ ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. కనకాలపేట, గోపాల్ నగర్, కురసాంపేట, పందుల్లంక తదితర ప్రాంతాల్లో స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రెవెన్యూ సిబ్బంది ఆయా స్థలాలు గూర్చి వివరించారు. స్థలాల పరిశీలన శుక్రవారం తుది నిర్ణయం తీసుకుంటారని భావిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎఒ మునిస్వామి, పిడబ్ల్యుడి తదితరశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీసంఘమిత్ర వార్షికోత్సవం

ప్రజాశక్తి - నల్లజర్ల

మండలంలోని దూబచెర్ల గ్రామంలో శ్రీ సంఘమిత్ర విద్యాలయం. 28వ వార్షికోత్సవం, గ్రాడ్యుయేషన్ డేని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గోపాలపురం ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య అనేది కేవలం అకడమిక్ జ్ఞానాన్ని అందించడమే కాదు సామాజిక బాధ్యతను తెలియజేస్తుందన్నారు. ఈ బాధ్యతను పెంపొందించడంలో సంఘమిత్ర కృషి చేస్తుందన్నారు. అనంతరం ఆయన చేతులమీదుగా సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు తాతిన సత్యనారాయణ, సర్పంచ్ తాడిగడప బాలయ్య, వైస్ ప్రెసిడెంట్ కాసాని బాలగంగాధర్, కూచిపూడి ఉదయభాస్కరరావు, ఈడే శ్రీనివాసరావు, రాజులపాటి ఆదినారాయణ, చీమకుర్తి కృష్ణ ప్రసాద్, అకాడమిక్ డైరెక్టర్ నెక్కంటి వెంకటేష్ యోగ మిత్ర రాజారావు, లీడ్ జోనల్ ఆఫీసర్ మిశ్రా, ఇండియన్ హ్యాండ్ రైటింగ్ చైర్మన్ పవన్ కుమార్, బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ సతీష్ పాల్గొన్నారు

పేదలకు సత్యసాయి విద్యార్థుల సాయం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం రూరల్



రాజమహేంద్రవరం బాలాజీపేటలోని శ్రీ సత్యసాయి గురుకులం ఇంగ్లీషు మీడియం స్కూల్ విద్యార్థులకు ఆకలితో అలమటిస్తున్న పేదలకు సాయం అందించారు. తమకు తోచిన రీతిలో పేదలకు ఆహారపొట్లాలు, మజ్జిగ ప్యాకెట్లు, వాటర్ ప్యాకెట్లు, పండ్లు పంచారు. సత్యసాయిబాబా వర్ధంతిని పురస్కరించుకుని స్వచ్ఛందంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు విద్యార్థులు తెలిపారు. విద్యార్థులతో పాటూ వారి తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు.





హెచ్ఎం సుబ్బారావు మృతి బాధాకరం

ప్రజాశక్తి - గోపాలపురం

హెచ్ఎం విరిసిపోము సుబ్బారావు ఆకస్మిక మృతి బాధాకరమని ఎంఇఒలు జి.శ్రీనివాసరావు, ఎ.మహేశ్వరరావు, తోటి ఉపాధ్యాయులు అన్నారు. స్థానిక బిసి కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం సుబ్బారావు గుండెపోటుకు గురై బుధవారం మరణించారు. ఆయన 28 ఏళ్ల పాటు విద్యారంగంలో కొనసాగారు. 2026లో ఉద్యోగ విరమణ పొందనున్నారు. 14 నెలల సర్వీసుఉండగానే మృతి చెందారు. ఆయన భౌతిక కాయాన్ని ఉపాధ్యాయులు విద్యాశాఖ అధికారులు, గ్రామస్తులు గురువారం సందర్శించి నివాళులర్పించారు.

నేరాలు ఘోరాలు

ఏలేరులో స్నానానికి దిగి అమ్మమ్మ, మనవడు మృతి

ప్రజాశక్తి-ఏలేశ్వరం

మండలంలోని ఎర్రవరం జాతీయ రహదారి సమీపాన ఏలేరు నదిలో స్నానానికి దిగి అమ్మమ్మ మనవడు మృతి చెందిన సంఘటన గురువారం వెలుగు చూసింది. ఎస్ఐ ఎన్ రామలింగేశ్వరరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ప్రత్తిపాడుకు చెందిన అరటకోట్ల సత్యవతి (52) తన కూతురి కొడుకు గోర్స వీర మనోజ్ (12)ను తీసుకుని బుధవారం సాయంత్రం ఏలేరు కాలువలో స్నానానికి దిగింది. ఊపిరాడక పోవడంతో ఇద్దరూ మునిగి చనిపోయారు. గురువారం సత్యవతి మృతదేహం నీటిలో తేలింది. స్థానికులు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాలువ గట్టుపై ఇద్దరి చెప్పులూ ఉండడంతో అనుమానం వచ్చి గాలింపు చర్యలు చేపట్టగా మనోజ్ మృతదేహం లభించింది. వీరి ఇంటి సమీపంలో ఉన్న గ్రామ దేవత ఉత్సవాలు ఉండడంతో పవిత్ర స్నానం చేసేందుకు ఏలేరు కాలువలో స్నానానికి వచ్చినట్లు కుమార్తె రమణమ్మ, అల్లుడు రాజు తెలిపారు. మృతదేహాలను ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఘర్షణలో నలుగురికి గాయాలు

ప్రజాశక్తి - కాత్రేనికోన

మండల పరిధిలో సమస్యాత్మక మత్స్యకార గ్రామమైన పల్లంలో ఇరు కుటుంబాల మధ్య ఘర్షణ జరగడంతో నలుగురికి గాయల కాగా ఆసుపత్రిలో చికిత్స పొందుతునట్లు పోలీసులు తెలిపారు. గురువారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పల్లం గ్రామ పంచాయతీ పరిధిలోని కుళాయిలు దగ్గర నీళ్లు పట్టుకుని ఇంటికి వెళుతున్న సమయంలో మహిళల పట్ల ఒకరిపై ఒకరు దూషించు కున్నారు. దీంతో ఇరు కుటుంబాల మధ్య గురువారం వివాదం చోటు చేసుకుంది. ఈ ఘర్షణలో మల్లాడి చిన్నవీర్రాజు, మల్లాడి లక్ష్మణ్, మల్లాడి ధర్మారావు, మల్లాడి దమయంతిలు ఘర్షణలో గాయపడిన క్షతగాత్రులను ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. జరిగిన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అవినాష్ తెలిపారు.

విద్యుత్ షాక్‌కు దింపు కార్మికుడు మృతి

ప్రజాశక్తి - చాగల్లు

నిడదవోలు మండలం తాడిమల్ల గ్రామానికి చెందిన దింపు కార్మికుడు కోలా ధనరాజు(22) విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. చిక్కాల గ్రామ శివారులో ఉన్న కొబ్బరి తోటలో కొబ్బరికాయలు దించేందుకు గురువారం వెళ్లాడు. మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో కొబ్బరికాయలు దించుతున్నాడు. కొబ్బరి ఆకు ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న విద్యుత్ వైర్లను తాకడంతో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. వెంటనే అతని నిడదవోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ధనరాజు సోదరుడు కోలా శివ ఫిర్యాదు మేరకు చాగల్లు ఎస్ఐ కె.నరేంద్ర కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిడదవోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పేకాడుతున్న 8 మంది అరెస్టు

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు శివారు మీనా నగరంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు గురువారం దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న 8 మందిని అరెస్టు చేశామని ఎస్ఐ కె.నరేంద్ర తెలిపారు. వారి నుంచి రూ.8వేల నగదు, పేకముక్కలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు.

డంపింగ్ యార్డ్‌పై పుదుచ్చేరిలో నిరసన

ప్రజాశక్తి - యానాం

60 రోజులుగా యానాం పట్టణంలో పారిశుధ్య పనులు నిర్వహించకపోవడంతో ఎక్కడి చెత్త అక్కడ నిలిచిపోయి పట్టణంలో ప్రతి వీధి ఒక్కో డంపింగ్ యార్డ్‌గా తయారైందని, సమస్యను పరిష్కరించకపోతే నిరాహారదీక్షకు దిగుతానని సిఎం రంగసామికి ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ స్పష్టం చేశారు. గురువారం ఆయన పుదుచ్చేరిలో నిరసన తెలిపారు. మరో ఎంఎల్ఎ శివశంకరన్‌తో కలిసి సిఎం రంగసామి కార్యాలయానికి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండు నెలల నుంచి యానాం పారిశుధ్య పనులు నిలిచిపోవడంతో వీధిలో దుర్గంధం వ్యాపించి ప్రజల ఆరోగ్యానికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయని అన్నారు. చెత్తను తొలగించకుండా, డంపింగ్ యార్డ్‌కు స్థలం కేటాయించకుండా ప్రభుత్వం చోద్యం చూస్తుండడం దారుణమన్నారు. ఆర్ఎఒ సమస్యను కాలయాపన చేయడానికి కోసం కావాలనే దీర్ఘకాలిక సెలవుల్లో వెళ్ళిపోతున్నారని తెలిపారు. పుదుచ్చేరిలో తాను నిరసనకు దిగుతున్నట్లు ముందు రోజే సమాచారం తెలుసుకుని కలెక్టర్‌ను యానాం పంపడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ప్రజల ఆరోగ్యాలను రాజకీయాలతో ముడిపెట్టడం తద్వారా లబ్ధి పొందాలి అనుకోవడం ప్రజా నాయకులకు తగదని స్పష్టం హితవు పలికారు.

ఫిట్ ఇండియా సైక్లింగ్

ప్రజాశక్తి - యానాం

స్థానిక బాలయోగి క్రీడా ప్రాంగణంలో సాయ్ స్పోర్ట్స్ ఇంచార్జ్ ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో ఫిట్ ఇండియా సైక్లింగ్ రైడ్‌ను గురువారం నిర్వహించారు. ఈ మేరకు సిఐ అదలరసన్, ట్రాఫిక్ ఎస్ఐ శేరు నూకరాజు సైక్లింగ్ రైడ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉదయ్ కుమార్ సైక్లింగ్ ప్రాముఖ్యతను వివరించారు. సైక్లింగ్‌ను ఆరోగ్యకరమైన రవాణా మార్గంగా ప్రోత్సహించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. సైక్లింగ్ శారీరకంగా, మానసికంగా ఆరోగ్యకరమైన జీవనశైలిని రూపొందించడంలో సహాయపడుతుందన్నారు. ప్రతి రోజు ఒక గంట పాటు సైక్లింగ్ రైడ్‌లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం పోలీసులకు యానాం పోలీస్ లీగ్ పేరిట క్రికెట్ పోటీలను నిర్వహించారు. ఐఆర్‌బి టీమ్ విజయం సాధించి ట్రోఫీ గెలుచుకున్నట్లు తెలిపారు.





విద్యావంతులుగా తీర్చిదిద్దడమే సెయింట్ జోసెఫ్ లక్ష్యం

ప్రజాశక్తి - గోపాలపురం

పిల్లలను ఉన్నతమైన విద్యావంతులుగా తీర్చిదిద్దడమే సెయింట్ జోసెఫ్ లక్ష్యమని కరస్పాండెంట్ సిస్టర్ ఎల్సి, ప్రిన్సిపల్ సిస్టర్ సిల్బీ అన్నారు. ఇటీవల విడుదలైన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో వేలచింతలగూడెంలోని సెయింట్ జోసెఫ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి మండలంలో ప్రథమ, ద్వితీయ, నాలుగవ స్థానాల్లో నిలిచారన్నారు. గురువారం అత్యుత్తమ మార్కుల సాధించిన విద్యార్థులను పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. క్రమశిక్షణ కలిగిన విద్యను అందించడం వల్లే ఈ విజయాలు సాధించామన్నారు. పదో తరగతి పరీక్ష ఫలితాలే దీనికి నిదర్శనమన్నారు. పేద మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నామని తెలిపారు. అనంతరం 585 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థిని కె.జోత్స్నశ్రీ, 581 మార్కులు సాధించి రెండో స్థానంలో నిలిచిన గంద్రోపు జాహ్నవిదేవి, 579 మార్కులతో నాలుగో స్థానంలో నిలిచిన ఎన్.మురళీకృష్ణలను సత్కరించారు. పదో తరగతిలో 86 మందికి 84 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు.ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రులకు , పాఠశాలకు సమాజానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

దగ్ధమైన పామాయిల్ తోట పరిశీలన

ప్రజాశక్తి - గోపాలపురం

విద్యుత్ వైర్ల షార్ట్ సర్క్యూట్ వల్ల కలిగిన అగ్నిప్రమాదంలో దగ్ధమైన పామాయిల్ తోటను విద్యుత్ శాఖ ఎఇ డి.శ్రీనివాసరావు గురువారం పరిశీలించారు. ఈ ప్రమాదంలో లక్షలాది రూపాయల నష్టం వాటిల్లింది. పొలంలో షార్ట్ సర్క్యూట్ ఏమీ జరగలేదని తెలిపారు. ఈ అగ్ని ప్రమాదం షార్ట్ సర్క్యూట్ వల్ల జరగలేదని స్పష్టం చేశారు.

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి -దేవరపల్లి

యర్నగూడెంలో పలు అభివృద్ధి పనులకు ఎంఎల్ఎ మద్దిపాటు వెంకట్రాజు గురువారం శంకుస్థాపన చేశారు. ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలో రూ.37లక్షలతో నిరించే అదనపు తరగతి గదుల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. నూతన వ్యాపార కూడలి, బిసి కమ్యూనిటీ భవనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు ఆంద్రు అనిల్, సీనియర్ నాయకులు కొయ్యలమూడి చినబాబు, పెన్మత్స సుబ్బరాజు, జనసేన మండల అధ్యక్షులు కాట్నం గణేష్, సర్పంచ్ బొంతా భరత్‌బాబు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు